




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 233 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 11-12-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


## తొలి విడతలో మొత్తం 189 మండలాలు

- 4,236 గ్రామపంచాయితీలు, 37,440 వార్డులు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- తొలి విడతలో ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- గ్రామాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నామే ఓట్ల లెక్కింపు...ఫలితం ప్రకటన
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

# నేడే తొలివిడత పంచాయితి పోరు



### ఎన్నికల నిర్వహణకు సర్వసిద్ధం

హైదరాబాద్,డిసెంబర్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
తెలంగాణ రాష్ట్రంలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పటికే జోరుగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు నేటి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీ ఎన్నికల్లో పోటీ పెరిగింది. తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయి. హైదరాబాద్‌లో ఎస్ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల -మిగతా 2 లో



# ఉస్మానియా యూనివర్సిటీ మహర్దశ

### వెయ్యికోట్లు విడుదలకు సీఎం రేవంత్ అంగీకారం



- వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి కంకణం
- తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం
- ధైర్యంతో కాదు... గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా
- చదువు రాకున్నా.. చదువు విలువ తెలిసినోడిని
- ఉస్మానియా సభలో సీఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం

హైదరాబాద్ డిసెంబర్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన -మిగతా 2 లో



# 'మీ డబ్బు.. మీ హక్కు'

- అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి
- ప్రధాని మోడీ మరోమారు పిలుపు

న్యూఢిల్లీ
అన్ క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బిఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు. క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు' మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను -మిగతా 2 లో



## ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు

- అప్పుల రీ షెడ్యూల్‌తో వడ్డీ భారం తగ్గే ఛాన్స్
- వృద్ధిరేటు పెంచేందుకు అవసరమైన చర్యలు
- గతేడాదితో పోలిస్తే 32 శాతం మేర పెరిగిన ధాన్యం కొనుగోళ్లు
- ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, -డిసెంబర్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
ప్రజల ఆకాంక్షల మేరకు పథకాల్లో మార్పులు, చేర్పులు జరగాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి శాఖ చేసిన పనులన్నీ తన వద్ద రికార్డు రూపంలో ఉన్నాయని చెప్పారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సదస్సు నిర్వహించారు. వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు ప్రణాళికపై చర్చించారు. -మిగతా 2 లో

# నీళ్లలో మునిగిన గ్రామానికి పంచాయతీ ఎన్నికలు

### నీళ్లలో గ్రామం... బ్యాలెట్ బాక్స్ బతికిందే!




- మునిగిన తిమ్మాపూర్‌కు సర్పంచ్ ఎన్నికలు
- గ్రామం లేదు... ఓటర్లు లేరు.. అయినా సర్పంచ్ ఎన్నిక!
- నీళ్లలో ఓటింగ్? తిమ్మాపూర్ ఎన్నికల వెనుక 'రూ.23 కోట్ల' మిస్టరీ
- రిజర్వాయర్ నడుమ సర్పంచ్ పదవి
- పంచాయతీ ఎన్నికల పేరుతో భారీ స్కెచ్?
- ప్రజలే లేని గ్రామానికి ప్రజాప్రతినిధి!
- 'యాదాద్రిలో పంచాయతీ ఎన్నికల పేరిట రూ.23 కోట్ల 'డ్రామా'?
- "నీలగిరి ఎక్స్ ప్రెస్" స్పెషల్ ఇన్వెస్టిగేషన్, సబ్ ఎడిటర్ ( అలేటి నవీన్ ) ?

యాదాద్రి జిల్లా, డిసెంబర్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
పంచాయతీ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు వెలుగు చూస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా అధికారుల నిర్లక్ష్యం మరోసారి బహిర్గతమయ్యింది. బస్వాపురం రిజర్వాయర్‌లో పూర్తిగా మునిగిపోయిన బిఎన్ తిమ్మాపూర్ గ్రామానికి సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ రావడం జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. గ్రామం భౌతికంగా లేనప్పటికీ, జనం లేకున్నప్పటికీ పాత ఓటర్ లిస్ట్ ఆధారంగా ఎన్నికలు నిర్వహించడం, అంతేకాదు ఎడ్ల వెంకట్ రెడ్డి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తీవ్ర చర్చకు దారి తీసింది. అధికారిక ప్రకటన ఒక్కటే మిగిలి ఉండటంతో 'నీలగిరి ఎక్స్ ప్రెస్' రంగంలోకి దిగి ప్రత్యేకంగా -మిగతా 2 లో



# పోలీసులకూ నిబంధనలు వర్తిస్తాయి.... వర్తించాలి కూడా!

హైదరాబాద్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్)
సమాజంలో న్యాయపాలన అంటే కేవలం పుస్తకాల మాటలు కాదు. నిబంధనలు అమలు చేయించే అధికార సంస్థలు స్వయంగా వాటిని పాటించినప్పుడే ప్రజల్లో విశ్వాసం బలపడుతుంది. అయితే, హైదరాబాద్-ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వద్ద జరిగిన ఒక ఘటన మాత్రం ఈ నమ్మకానికి నూలుపోగు తెచ్చింది. హెల్మెట్ లేకుండా ఫోన్ మాట్లాడుతూ బైక్ నడుపుతున్న ఒక పోలీసు సిబ్బంది దృశ్యం నీలగిరి ఎక్స్‌ప్రెస్ కెమెరాలో బంధించబడింది. సాధారణ ప్రజలు ఇదే తప్పిదం చేస్తే క్షణాల్లో ఈ-చలాన్ జారీ అవుతుంది. కానీ ఈ ఘటన ప్రజల్లో ఆలోచింపజేసే ప్రశ్నను లేవనెత్తుతోంది"పోలీసులకు నిబంధనలు వర్తించవా?" ప్రజలు ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమిస్తే వెంటనే జరిమానాలు, పాయింట్లు, వాహన సీజ్ ఇలా కఠిన చర్యలు తీసుకునే పోలీస్ శాఖ, తమ సిబ్బందిపై మాత్రం



అదే కఠినతను ప్రదర్శించకపోవడం అసమానతకు దారితీస్తోంది. హెల్మెట్ లేకుండా -మిగతా 2 లో

# ' మీ డబ్బు.. మీ హక్కు'



(మొదటి తరువాయి)

ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ.. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్‌ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్‌లకెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.

### ప్రజల ఆకాంక్షల మేరకు

## పథకాల్లో మార్పులు

(మొదటి తరువాయి)

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని దిశానిర్దేశర చేశారు. అధిక వడ్డీలతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని.. అప్పులు రీ షెడ్యూల్ అయితే వడ్డీ భారత తగ్గుందని ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏడాదికి రూ. 7 వేల కోట్లు ఆదా అవుతుందని ఆయన వివరించారు. కేంద్ర నిధులను ఖర్చు పెట్టండి.. యూసీలు ఇవ్వండని వారిని కోరారు. ఫైళ్లను పెండింగులో పెట్టొద్దని మంత్రులు, ఉన్నతాధికారులకు సూచించారు. పని తీరు మెరుగు పరచుకోవాలంటూ వారికి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంచేశారు. అనంతపురం వేరుశనగ రైతులకు దేశంలోనే తొలిసారి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. ఆ జిల్లాలో కరవు తీర్చేందుకు ఇజ్రాయెల్ సాంకేతికతను పరిశీలించాం. రాయలసీమలో పశువులకు గడ్డి కూడా దొరకని పరిస్థితి ఉండేది. అనంతపురం జిల్లాలో నాణ్యమైన వేరుశనగ పండేలా చర్యలు చేపట్టాం. అన్నా హజారే, రాజేంద్రసింగ్ స్ఫూర్తితో జలసంరక్షణ చేపట్టాం. రాయలసీమలో ఇప్పుడు భూగర్భజలాలు పైకి వచ్చాయి. భూగర్భజలాలు 3 మీటర్లకు చేరితే ఖర్చుపెట్టే బ్జడెట్ తగ్గుతుంది. సౌరశక్తి వినియోగించుకుంటే విద్యుత్ డిమాండ్ బాగా తగ్గుతుంది. ఈ ఏడాది కరెంట్ ఛార్జీలు పెంచం. దేశంలో ఇండస్ట్రియల్ పార్కులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం మనదే' అని చంద్రబాబు అన్నారు.మరోవైపు ధాన్యం కొనుగోళ్లపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. 23 జిల్లాల్లో ఇప్పటి వరకూ 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు వివరించారు. గతేడాదితో పోలిస్తే 32 శాతం మేర ధాన్యం కొనుగోళు పెరిగాయని ఈ సందర్భంగా తెలిపారు. మొత్తం 2,606 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియ జరుగుతున్నదని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల వద్ద 7.89 కోట్ల గోనె సంచులను రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలోనే రూ.4,085 కోట్ల మేర చెల్లింపులు జరిపినట్లు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఈ ఏడాది మొత్తంగా 50.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్న ఈ సమీక్షా సమావేశంలో వివరించారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తోపాటు వ్యవసాయ, పౌరసరఫరాలు, ఆర్థిక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఈ సమావేశంలో వివిధ శాఖలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు, కార్యదర్శులు, పలు విభాగాల అధిపతుల పాల్గొన్నారు.

## పోలీసులకూ నిబంధనలు వర్తిస్తాయ.... వర్తించాలి కూడా!

(మొదటి తరువాయి)

డ్రైవింగ్ చేయడం, ఫోన్ మాట్లాడుతూనే వాహనం నడపడం, సిగ్నల్‌ను పట్టించుకోకపోవడం .. ఏ తప్పిదమైనా ప్రజలకు గంభీరమైన శిక్ష. కానీ పోలీస్ సిబ్బంది అదే నిబంధనలను ఉల్లంఘించినప్పుడు స్పందన మాత్రం మౌనం. ఈ రెండు వైఖరులతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. నిజానికి, శాసనాన్ని అమలు చేసే శాఖే ముందుగా ఆదర్శంగా నిలవాలి. "ముందు జాగ్రత్త... తర్వాత శాసనం!" అన్నట్లు, ప్రజలకు నిబంధనలు ప్రచారం చేసే ముందు పోలీసులు వాటిని కచ్చితంగా అనుసరించాలి. శిక్షించడం కంటే చూపించడమే బలమైన సందేశం. ఒకవేళ ప్రజలకు వర్తించే రూల్స్‌కు పోలీస్ శాఖ మినహాయింపు ఇవ్వకపోతేనే సమాజంలో నిజమైన న్యాయం నిలుస్తుంది.ఇది కేవలం జరిమానాల అంశం కాదు

ఇది సమానత్వం గురించినది.ఇది బాధ్యత గురించినది.ఇది పోలీసులపై ప్రజల నమ్మకం గురించినది.పోలీస్ శాఖలో క్రమశిక్షణ అమలైతేనే రోడ్లపై క్రమబద్ధత పెరుగుతుంది. నియమాలు అన్నీ ఒకేలా, అందరికీ సమానంగా వర్తించినప్పుడే నిజమైన న్యాయం సాద్యమవుతుంది. ప్రజలను క్రమబద్ధతకు ప్రోత్సహించాలంటే, పోలీసులు ముందుగా అదే క్రమశిక్షణకు నిదర్శనంగా నిలవాలి.

# నేడే తొలివిడత పంచాయితీ పోరు

(మొదటి తరువాయి)

ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల పక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ.8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్‌ఈసీ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల పక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రో ఆబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. మిగతా ఓటర్లు 'టీఎస్ ఈ-పోల్ మొబైల్ యాప్' ద్వారా కూడా తమ ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఓటింగ్ కేంద్రం తెలుసుకునేందుకు అదే యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు 3,214 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా.. 31,428 మందినిబైండోవర్ చేసినట్లు, 902 లైసెన్స్డ్ ఆయుధాల డిపాజిట్, రూ.7.54 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాల స్వాధీనం చేసినట్లు రాణి కుముదిని వెల్లడించారు. నిన్న సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు మూసివేశామని ఆమె తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా 31 జిల్లాల అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ ఇచ్చామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాంతులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్‌ఈసీ వివరించారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీ మహర్దశ

(మొదటి తరువాయి)

రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ.1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడు తున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు.

విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి. మంజూరు చేసిన రూ.1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

# నీళ్లలో మునిగిన గ్రామానికి పంచాయతీ ఎన్నికలు!

(మొదటి తరువాయి)

విచారణ చేపట్టింది.

**- గ్రామం నీళ్లలో .. ఓటర్లు మున్సిపాలిటీలో!**


నిజానికి తిమ్మాపూర్ గ్రామ ప్రజలందరూ ఇప్పటికే భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో పునరావాసం పొందారు. అక్కడే వారు నివసిస్తున్నారు, అక్కడే ఓటు హక్కులు కలిగి ఉన్నారు. కానీ గ్రామమే లేకున్నా గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఎన్నిక జరగడం స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఎన్నికలు తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టానికి పూర్తిగా విరుద్ధం అని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**- రూ.23 కోట్ల కోరి స్కెచ్?**

తెలంగాణ పంచాయితీ రాజ్ చట్టం -2018లోని సెక్షన్ 3, 4, 268 ప్రకారం జనాభా లేని, మునిగిపోయిన గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. అలాగే ఆర్టికల్ 243 (ఈ), 243 (కే) ప్రకారం కూడా ముప్పు గ్రామాల్లో ఎన్నికలు చెల్లవని తెలంగాణ హైకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. అయినప్పటికీ, ఇంకా ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.23 కోట్ల నష్టపరిహారం కోసం సర్పంచ్ ఉండాలనే ఉద్దేశంతో ఏకగ్రీవ ఎన్నికకు స్కెచ్ వేశారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా, గ్రామాన్ని ఇప్పటికే ప్రభుత్వ గ్రామంగా ప్రకటించిన సమాచారాన్ని పక్కన పెట్టి నోటిఫికేషన్ జారీ కావడం అనేక ప్రశ్నలకు దారి తీస్తోంది.

**- 156 ఎకరాల్లో పునరావాసం, గ్రామం ప్రభుత్వ ఆధీనంలో**

ప్రాజెక్ట్ నిర్మాణానికి తిమ్మాపురం గ్రామ పరిధిలోని



గృహాలు, వ్యవసాయ భూములు, చెట్లు, బావులు అన్నింటినీ ప్రభుత్వం సర్వే చేసి డీఎన్డీ నోటిఫికేషన్ ద్వారా స్వాధీనం చేసుకుంది. గ్రామ ప్రజలను సుమారు 156 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పునరావాసం కల్పించగా, భువనగిరి మున్సిపాలిటీలో 200 గజాల చొప్పున స్థిర నివాసాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే రూ.1050 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించినట్లు కాగ్ నివేదిక కూడా స్పష్టం చేసింది. తిమ్మాపురం గ్రామ పరిధి పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లింది. అయినా గ్రామ పంచాయతీ రద్దు మున్సిపాలిటీలో విలీనం నోటిఫికేషన్ ఉన్నప్పటికీ ఎన్నికల ప్రక్రియ కొనసాగడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

**- ఓటర్లలో అయోమయం.. అనుమానాల మబ్బు**

ఈ పరిస్థితిలో బీఆర్ఎస్ మద్దతుతో ఎడ్ల వెంకట్ రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడం, ఆయన ఏకగ్రీవ ఎన్నిక కావడం ప్రజల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టించింది.

"మేమింకా తిమ్మాపురం గ్రామ ప్రజలమా?"

-"లేదా మున్సిపాలిటీ ఓటర్లమా?"

-"రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాల్సింది ఎక్కడ?"

అని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు.

ఇక గ్రామమే లేనప్పుడు సర్పంచ్ పదవిని నిధుల కోసమే వాడుకుంటారా? పనులు చేయకుండానే బిల్లులు ఎత్తేస్తారా? నీళ్లలో రోడ్లు చూపిస్తారా? అంటూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎమ్మెల్యే మౌనం పై విమర్శలు**

ప్రతి గ్రామంలో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి గెలవాలంటూ పార్టీ అధిష్టానం ఆదేశాలిస్తుంటే, డీసీసీ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాత్రం ఈ వ్యవహారంపై పూర్తిగా మౌనంగా ఉండటం విశేషంగా మారింది.

గ్రామమే భౌతికంగా లేకపోయినా అధికారులను కనీసం ప్రశ్నించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కలెక్టర్ స్పందించాలన్న డిమాండ్**

ఈ అంశంపై యాదాద్రి జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చట్టబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారిక ప్రకటనకు ముందే ఎన్నికను రద్దు చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోకపోతే ఈ వ్యవహారం రేపు పెద్ద చట్టపరమైన వివాదంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత దంత వైద్య సేవలు



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దంత వైద్య క్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కరీంనగర్ కళాభారతిలో మున్సిపల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దంత వైద్య శిబిరాన్ని ఆమె మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దంత సమస్యలు ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందజేస్తామని చెప్పారు. మున్సిపల్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. క్యాంపు నిర్వహణ, తదుపరి వైద్య సేవలపై దంత వైద్య బృందంతో కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్ఎంఓ నవీనా, ప్రభుత్వ దంత వైద్యులు రవి ప్రవీణ్ రెడ్డి, రణదీప్, ప్రవీణ్, రాజు, సతీష్ పాల్గొన్నారు.

# పట్టణ సమస్యలపై కమిషనర్‌తో కాంగ్రెస్ నేతల సమావేశం



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ ఈరోజు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా సీఎం అస్యూరెన్స్ కింద ప్రారంభమైన పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా వీధి దీపాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లిస్టులు, రేకుర్తి –%బొమ్మకల్ మధ్య డి94 కాలువలోని మురుగు నీరు, సిల్టు తొలగింపు, డంప్ యార్డ్ సమస్యలపై తీవ్రంగా చర్చించారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, స్మార్ట్ సిటీ పనులు ముగిసినందున కొత్త లైట్లు ఏర్పాటు చేస్తామని, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్, పలిశెట్టి భూమయ్య, కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి, మడుపు మోహన్, వీర దేవేందర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్రపై అవగాహన కార్యక్రమం



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ అవినీతి నిర్మూల దినోత్సవం సందర్భంగా హోమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో “అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర” అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ అవినీతి ఏ రూపంలో ఉన్నా దానిని ప్రశ్నించడం, నిర్మూలించడం ప్రతి పౌరుడి బాధ్యత అని విద్యార్థులకు వివరించారు. ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 గురించి అవగాహన కల్పించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు తిరుపతి, పాఠశాల ప్రధానాచార్యుడు రాజమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల దినోత్సవ అవగాహన కార్యక్రమం





**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి సరస్వతి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మహిళల భద్రత, హక్కులు మరియు పిల్లల రక్షణకు సంబంధించిన చట్టాలపై నిపుణులు వివరణ ఇచ్చారు. ముఖ్య అతిథి అడ్వకేట్ రాజారెడ్డి మాట్లాడుతూ గృహ హింస చట్టం 2005, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 వంటి చట్టాలు మహిళలకు రక్షణ కల్పిస్తున్నాయని వివరించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ హక్కు ప్రాముఖ్యతను వివరించి, మహిళలు విద్య, ఉద్యోగం, ఆస్తి, వ్యక్తిగత నిర్ణయాల్లో పూర్తి స్వేచ్ఛ కలిగి ఉన్నారని చెప్పారు. అందే వెంకటేశ్వర్లు బాల్యవివాహ నిషేధ చట్టం 2006, ఫోక్సో చట్టం 2012పై అవగాహన కల్పిస్తూ, పిల్లల రక్షణకు ఈ చట్టాలు బలంగా పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సి డబ్ల్యూ సి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, మెప్మా పిడి స్వరూప రాణి, సిడిపిఓలు, డిసిపిఓ పర్వీన్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సంపత్, సఖి సిబ్బంది, మహిళలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## శాతవాహన విశ్వవిద్యాలయానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 1000 కోట్ల రూపాయల ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీవో విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, శాతవాహన విశ్వవిద్యాలయానికి కూడా 500 కోట్ల రూపాయలు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. ఆయన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి విశ్వవిద్యాలయాలు అరకొర నిధులతోనే నెట్టుకొస్తున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం చలనం తెచ్చుకోవాలని కోరారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని, లా విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించాలని సూచించారు. నిధుల కొరత కారణంగా విశ్వవిద్యాలయం అభివృద్ధి నత్తనడకన సాగుతోందని, విభాగాలు ఆమడ దూరంలో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా 500 కోట్ల రూపాయలు కేటాయిస్తే శాతవాహన విశ్వవిద్యాలయం విద్యార్థుల ప్రయోగశాలగా మారుతుందని, యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని కాంపెల్లి అరవింద్ స్పష్టం చేశారు.

# బాల ప్రతిభకు గంగుల అభినందనలు




**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరానికి చెందిన రెండు సంవత్సరాల బాలుడు శ్రీ రుద్రాంశ్ విశ్వ అసాధారణ ప్రతిభతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. 386 వస్తువుల పేర్లు, రాష్ట్రాలు, దేశాలు, శ్లోకాలు గుర్తించడం ద్వారా తన మేధస్సును చాటుకున్న ఈ బాలుడికి కాలమ్స్ వరల్డ్ రికార్డ్స్ వారు “ఎక్స్‌ట్రా ఆర్డినరీ గ్రాస్పింగ్ పవర్ జీనియస్ కిడ్ 2025 అచ్చీవర్” అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు ఎమ్మెల్యే గంగులను వారి నివాసంలో కలిశారు. బాలుడు ఎమ్మెల్యేను వెంటనే గుర్తించి “గంగుల” అని పలకడం అందరినీ ఆనందపరిచింది. సంతోషంతో ఎమ్మెల్యే గంగుల బాలుడిని ఎత్తుకుని, ప్రపంచ పటంలోని దేశాలను గుర్తించి చెప్పిన ప్రతిభను ప్రశంసించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా అవార్డును బాలుడికి అందజేసి అభినందించారు. బాలుడు భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, పిల్లాడిని తీర్చిదిద్దిన తల్లిదండ్రులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలుడి తల్లిదండ్రులు మాధురి, శ్రవణ్ కుమార్, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, బిఆర్ఎస్ నాయకులు మిడిదొడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో మానవతా పరిమళం



**పెద్దపల్లి, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
క్రిస్మస్ పండుగ సందర్భంగా కల్వరి ప్రత్యక్షత ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో మానవతా దృక్పథంతో కూడిన కార్యక్రమం వైభవంగా జరిగింది. క్రీస్తు జననాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అనంతరం నిరుపేద వితంతువులకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. పాస్టర్ బొంకూరి షేద్రక్ క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు, నిస్సహాయులకు సాయం చేయడమే క్రీస్తు ప్రేమను ఆచరణలో పెట్టడం అని పేర్కొన్నారు. సిస్టర్ రహేల ఈ సేవలో భాగమవడం దేవుడిచ్చిన గొప్ప బహుమతి అని అన్నారు. సంఘ సభ్యులు పంపిణీ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, పేద వితంతువులకు బట్టలు అందజేయడంలో కీలక పాత్ర పోషించారు. మతపరమైన ఉత్సవాన్ని సేవా కార్యక్రమంతో కలిపి నిర్వహించినందుకు స్థానికులు మందిరాన్ని, పాస్టర్ షేద్రక్, సిస్టర్ రహేలను అభినందించారు.

# బసంతనగర్‌లో సర్పంచ్ అభ్యర్థి ఉద్యోగ వివాదం



**పాలకుర్తి, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బసంతనగర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి తువ్వ సతీష్ యాదవ్‌కు అల్ట్రాటెక్ కంపెనీ యాజమాన్యం “ఉద్యోగానికి అనర్హుడివి, రాజకీయాల్లోకి వెళ్ళు” అంటూ నోటీసులు జారీ చేసింది. కంపెనీ నియమాలకు విరుద్ధంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నావని పేర్కొంటూ ఆయనను ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నారని సతీష్ యాదవ్ తెలిపారు. దీనిపై ఆయన మండిపడుతూ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉన్నప్పుడు ప్రైవేటు సంస్థ ఉద్యోగులకు ఎందుకు ఆ అవకాశం ఇవ్వకూడదని ప్రశ్నించారు. కంపెనీ యాజమాన్యం తనను ముందే బెదిరింపులకు గురి చేస్తోందని, ఇలాంటి చర్యలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. బసంతనగర్ ప్రజలు కంపెనీ కారణంగా దుమ్ము, ధూళి కాలుష్యంతో అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన గ్రామ ప్రజల కోసం ఉద్యోగాన్ని వదులుకోవడానికి కూడా సిద్ధమని, ఈ నోటీసులపై త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ఆయన తెలిపారు. ఈ ఘటనలో ఒక ప్రైవేటు సంస్థ ఉద్యోగి ఎన్నికల్లో పోటీ చేయడంపై నిషేధం, ప్రజల మద్దతు, కంపెనీ–ప్రజల మధ్య ఉన్న సమస్యలు, న్యాయపరమైన పోరాటం అన్నీ కలిసిన ఒక వివాదాస్పద పరిస్థితి ఏర్పడింది.

# పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో గురువారం జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు 2025లో భాగంగా కరీంనగర్ రూరల్ మండలానికి ఎంపీడీవో కార్యాలయంలో, కొత్తపల్లి మండలానికి ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఈ కేంద్రాలను సందర్శించి, ప్రతి కౌంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడి, ఎన్నికల సామాగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించిన ఆమె, సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కూడా పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండి సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్శనలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలపై బండి సంజయ్ పిలుపు



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారీ నిధులు కేటాయిస్తోందని, పల్లె ప్రగతికి మోదీ ప్రభుత్వమే ప్రధాన ఆధారం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ముందు ఒక్క క్షణం ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంజయ్ మాట్లాడుతూ రైతు వేదికలు, స్మశాన వాటికలు, రోడ్లు, వీధి దీపాలు, కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్లు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీలు, పల్లె దవాఖానలు కేంద్ర నిధులతోనే నిర్మించబడ్డాయని తెలిపారు. పేదలకు ఇళ్లు, గ్యాస్ కనెక్షన్లు, రేషన్ బియ్యం, ఉపాధి హామీ పనులు, ఎరువుల సబ్సిడీలు మోదీ ప్రభుత్వమే అందజేస్తోందని వివరించారు. అదనంగా, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జాతీయ రహదారుల విస్తరణకు వేల కోట్ల రూపాయలు తెచ్చినట్లు, సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా 219.5 కోట్లతో 12 రోడ్లు, గ్రామీణ సడక్ యోజన ద్వారా 116 కోట్లతో 32 రోడ్లు నిర్మాణంలో ఉన్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు, మోదీ కిట్లు, పరీక్షా ఫీజుల మినహాయింపు, ఆసుపత్రులకు మెడికల్ ఎక్విప్‌మెంట్లు, మెడికల్ కాలేజీలకు బస్సు సౌకర్యం వంటి సేవా కార్యక్రమాలను కూడా ఆయన ప్రస్తావించారు. గ్రామాల అభివృద్ధి కోసం నిధులు అందిస్తున్న బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, పల్లెల్లో చిచ్చు పెడుతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధికి గ్రామాలే మూలస్తంభాలు. గ్రామాలను అభివృద్ధి చేస్తేనే వికసిత్ భారత్ సాధ్యమవుతుంది అని ఆయన పేర్కొన్నారు.

## మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు




**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల (కుమార్ వాడి)లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు మహేష్ మాట్లాడుతూ ప్రతి మనిషికి రాజ్యాంగం హక్కులను ప్రసాదించిందని, వాటిని కాపాడుకోవడానికి చట్టాలు రూపొందించబడ్డాయని తెలిపారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకొని అవగాహన పెంచుకోవాలని, కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినప్పుడు తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని, చట్టపరమైన సమస్యల కోసం 15100 నంబర్‌కు కాల్ చేసి న్యాయ సలహా పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో మానవ హక్కుల దినోత్సవ సందేశం



**హుస్నాబాద్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ సంఘ సేవకుడు, రాష్ట్ర గవర్నర్ గారిచే రాష్ట్రస్థాయి సిల్వర్ గోల్డ్ అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాన హక్కుల కోసం కృషి చేయాలని, ప్రభుత్వం ప్రజలకు అవకాశాల కల్పన కోసం కృషి చేయాలని కోరారు. జాతి, వర్ణ, లింగ, కుల, మత వివక్షత లేకుండా ప్రజలందరూ స్వచ్ఛమైన వాతావరణంలో సమానత్వంతో జీవించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎవరు మానవ హక్కులను హరించకూడదని, ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకొని స్వేచ్ఛగా జీవించాలన్నారు.

## ఎయిడ్స్ నివారణపై సమీక్షా సమావేశం



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐసీటీసీ, పిపిటిసిటి, డీఆర్‌సి, ఏఆర్టి, ఎస్ఎస్‌కె, టిఐ, ఎన్‌జిఒ, ఎల్‌డబ్ల్యూఎస్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఏప్రిల్ 2025 నుండి నవంబర్ 25 వరకు ఉన్న టార్గెట్లు, సాధించిన ఫలితాలను సమీక్షించారు. డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ హెచ్ఐవి పరీక్షలు చేసి పేషెంట్లను ఏఆర్టి సెంటర్‌కు పంపించి ఉచిత మందులు అందించాలన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీకి తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు జరిపి, పాజిటివ్ వచ్చినవారికి పుట్టబోయే శిశువుకు హెచ్ఐవి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హై రిస్క్ గ్రూప్ వ్యక్తులను గుర్తించి వారికి హెచ్ఐవి, సుఖవ్యాధుల పరీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఓ ఎన్సిడి డాక్టర్ ఉమాశ్రీ, అదనపు డీఎంహెచ్వో డాక్టర్ సుధ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా ఉంటా

**భీమారం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి అలకాటి భాగ్యలక్ష్మి-తిరుపతి**

**, మంచిర్యాల జిల్లా,డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భీమారం గ్రామ అభివృద్ధి ఏకైక ఎజెండాగా భీమారం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి అలకాటి భాగ్యలక్ష్మి-తిరుపతి అన్నారు, సోమవారం రోజున భీమారం వ్యాప్తంగా వివిధ వార్డులలో వార్డు నెంబర్ అభ్యర్థులతో కలసి ప్రచారం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు, పద్మశాలి సంఘం, యువకులు, మహిళలు, పాల్గొన్నారు

## కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం




**పెద్దపల్లి, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూలపల్లి మండలంలోని వడ్కాపూర్, వెంకట్రావుపల్లి, కుమ్మరికుంట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఇంటింటికీ తిరిగి ఓటు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని, రైతులను వరి ధాన్యం కొనుగోలు విషయంలో మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉచిత కరెంట్, సన్న బియ్యం, వడ్లపై బోనస్, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. రెండేళ్లలోనే ప్రజా ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దుర్గం నగేష్‌కు గౌరవ డాక్టరేట్



**గోదావరిఖని, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సామాజిక సేవ రంగంలో విశిష్ట కృషి చేసినందుకు అమెరికా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ తెలంగాణకు చెందిన దుర్గం నగేష్ నాగేశ్వరరావుకు డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. యూనివర్సిటీ సెనేట్, అడ్వైజరీ బోర్డ్ సమగ్ర పరిశీలన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో పేర్కొంది. డిసెంబర్ 13న చెన్నైలో జరగనున్న వార్షిక కాన్వొకేషన్ వేదికపైనే ఈ గౌరవ డాక్టరేట్ అందజేయనున్నట్లు యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ పి. మాన్యువెల్ తెలిపారు. విద్య, ఆరోగ్యం, పేదల సంక్షేమం, హక్కుల సాధన, సామాజిక న్యాయ విభాగాల్లో నగేష్ గత కొన్నేళ్లుగా చేసిన సేవా కార్యక్రమాలు అంతర్జాతీయ వేదికల దృష్టిని ఆకర్షించాయని పేర్కొన్నారు. సమాజపు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా నిరంతర సేవ చేస్తూ పలు సంస్థలతో కలసి చేపట్టిన కార్యక్రమాలకు ఈ డాక్టరేట్ గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ, ఇది నాకు మాత్రమే కాదు, సామాజిక మార్పు కోసం శ్రమిస్తున్న ప్రతి సేవాకారునికి లభించిన గుర్తింపు. ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తోంది అని అన్నారు.

## రైల్వే, పరిశ్రమల అభివృద్ధి కోసం ఎంపీ గళమెత్తారు



**పెద్దపల్లి, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పార్లమెంట్ ప్రశ్నోత్తర సమయంలో పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి అంశాలను ఎంపీ ప్రస్తావించారు. రామగుండం -మణుగూరు మధ్య కొత్త రైల్వే లైన్‌కు అనుమతి లభించిందని, ఈ ప్రాజెక్టుకు భారీ నిధులు అవసరమని తెలిపారు. కుందన్‌పల్లి ప్రాంతం, కున్నారం ఫ్లైఓవర్, మంథని వంతెన నిర్మాణానికి కూడా నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై రైల్వే మంత్రి త్వరలో పనులు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. అదేవిధంగా పెద్దపల్లి ప్రాంతంలో సెమీకండక్టర్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తే పరిశ్రమలు విస్తరించి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గతంలో తెలంగాణకు రావాల్సిన ఒక సెమీకండక్టర్ ఫ్యాక్టరీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిన విషయాన్ని కూడా సభ దృష్టికి తీసుకువచ్చారు. పెద్దపల్లి యువత ప్రతిభావంతులని, వారికి స్కిల్ డెవలప్‌మెంట్ అందిస్తే భవిష్యత్తు మరింత బలపడుతుందని ఎంపీ అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం ఇచ్చిన ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను పరిశీలించి విస్తృత చర్చ చేస్తానని, పెద్దపల్లి ప్రాంతంలో పరిశ్రమల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జై హింద్.. జై తెలంగాణ!

## శాతవాహన కామర్స్ కళాశాలలో ఎత్నిక్ డే



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయ వాణిజ్య కళాశాలలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఎత్నిక్ డే ఈసారి కూడా ఉత్సాహంగా జరిగింది. ఉపకులపతి ఉమేష్ కుమార్ తన సతీమణితో కలిసి సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయాలను మరవకుండా జాతి గౌరవాన్ని పెంపొందించే ఆచారాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్ మాట్లాడుతూ వినాయక చవితి, దసరా, దీపావళి, క్రిస్మస్, రంజాన్, బతుకమ్మ, సంక్రాంతి వంటి పండగలు సంప్రదాయానికి ప్రతీకలని, వీటిని తరతరాలకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రిన్సిపాల్ హరికాంత్ మాట్లాడుతూ ఎత్నిక్ డే కళాశాల వార్షిక ఆచారమని, విద్యార్థులు ప్రతి సంవత్సరం ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పట్టు చీరలు, ధోవతులు, కుర్తాలు, పైజామాలు ధరించి పాల్గొన్నారు. రకరకాల పిండి వంటలను పంచుకుంటూ కళాశాల ఆవరణలో సాంప్రదాయ వాతావరణాన్ని అలరించారు.

# రామగుండం కమిషనరేట్‌లో పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన బందోబస్త్



**పెద్దపల్లి, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో కలిపి 1712 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 538 క్రిటికల్‌గా గుర్తించారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి నగదు, మద్యం, గంజాయి, పిడియస్ బియ్యం సీజ్ చేసి, మొత్తం రూ.16.59 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 781 మందిని బైండోవర్ చేసి, ఆయుధాల లైసెన్సులు డిపాజిట్ చేయించారు.ఎన్నికల రోజున డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, హోం గార్డులు, ఆర్మ్‌డ్ సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ సహా 1600 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, మొబైల్ ప్యాట్రోలింగ్, పోలీస్ పికెట్లు సిద్ధంగా ఉన్నాయని కమిషనర్ తెలిపారు.డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ, బెదిరింపులు, గొడవలు, అల్లర్లు వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ధైర్యంగా, శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన స్పష్టం చేశారు.

# కొనుగోలు కేంద్రంలో ధాన్యం సమస్యలపై బి ఆర్ యస్ పరిశీలన





**హుస్నాబాద్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కన్నపేట్ మండలం మల్లంపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బి ఆర్ యస్ పార్టీ నాయకులు పరిశీలించారు. తేమ శాతం, తాలు పేరిట అధికారులు పెట్టే కొరతలు, మిలర్స్ యాజమానుల నిర్లక్ష్యం కారణంగా రైతులు రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే గడపాల్సి వస్తోందని పార్టీ నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యం సంచులు కంటాలు పెట్టినా మిలర్స్ తీసుకోకపోవడం వల్ల పది రోజులు పైగా కేంద్రాల్లో నిలిచిపోతున్నాయని, తరుగు పేరిట మిలర్స్ ఇష్టారాజ్యంగా రైతులను దోపిడీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా కేవలం ప్రచారానికే పరిమితమైందని ఆరోపించారు.రైతుల పక్షాన నిలబడి బి ఆర్ యస్ పార్టీ పోరాటం చేస్తుందని మల్లికార్జున రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్యామ్, ఇతరులు పాల్గొన్నారు.

# నకిరకొమ్ముల గ్రామంలో ఏకగ్రీవ ఎన్నికలపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం



**హుస్నాబాద్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ మండలం నకిరకొమ్ముల గ్రామ పంచాయతీ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుర్ర కళ్యాణి మహేష్, ఉప సర్పంచ్ శ్రీగిరి సూర్యకళ వెంకటేష్, వార్డు సభ్యులు బొల్లి సంపత్, గుడ్ల ఉమ అశోక్, బుర్ర శ్రీలత శ్రీనివాస్, దక్షిణమూర్తి, సుమలత, గట్టు రమేష్, జాగిడి పర్శరాములను ఆయన హైదరాబాదులోని క్యాంపు కార్యాలయంలో కలుసుకుని అభినందించారు.గ్రామ ప్రజలు ఐక్యంగా ఏకగ్రీవంగా ఎన్నికలు జరిపినందుకు అభినందనలు తెలుపుతూ, గ్రామ అభివృద్ధికి తాను అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామ సమస్యలను పరిష్కరించి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రజలు ఐక్యంగా ఉండి మార్పు చూపించడానికి ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు.

# డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



**చొప్పదండి, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు 2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో మొదటి విడత పోలింగ్ జరగనున్న చొప్పదండి మండలంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం పరిశీలించారు.ఎన్నికల సిబ్బందితో మాట్లాడిన ఆమె, పోలింగ్ సామాగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం విధులను పూర్తి చేసి, ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

# శాంతియుత ఎన్నికలే లక్ష్యం : పెద్దపల్లి డీసీపీ



**పెద్దపల్లి, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంథని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులకు, సిబ్బందికి ఎన్నికల విధులపై సమగ్ర సమావేశం జరిగింది. పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ బూతుల్లో భద్రతా ఏర్పాట్లు, రూట్ మొబైల్ టీంలు, క్యూ.ఆర్.టీ, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ వంటి బృందాలు చేపట్టాల్సిన పనులను వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలను కఠినంగా పర్యవేక్షించి వెంటనే చర్యలు తీసుకోవాలని, అభ్యర్థులు లేదా రాజకీయ కార్యకర్తల ఒత్తిడి లేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, మద్యం, డబ్బు, ఉచితాల పంపిణీ వంటి అక్రమాలపై నిఘా పెట్టి ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు వేయగల వాతావరణాన్ని కల్పించాలన్నారు. చిన్న గొడవలనైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించి శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, సీఐ బి. రాజు, ఇన్స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**సిద్దిపేట, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో జరగనున్న పోలింగ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గజ్వేల్, ములుగు, రాయపోల్, దౌలతాబాద్ మండలాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్స్‌ను సిబ్బంది పూర్తిగా తనిఖీ చేసి, బ్యాలెట్ పేపర్ల లెక్కలు సరిచూడాలని సూచించారు. రేపు ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ పూర్తి చేసి, 7 గంటలకు ఓటింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం నివేదించాలని, మధ్యాహ్నం 1 గంటకు ఓటింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేసి, 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించాలని తెలిపారు.కౌంటింగ్ సెంటర్లలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఏజెంట్లు, సిబ్బంది మొబైల్ ఫోన్లు వాడరాదని స్పష్టం చేశారు. ఎన్నికల విధులకు గైర్హాజరు అయిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ఓటింగ్, కౌంటింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో ఆర్డీవో చంద్రకళ, ఎంపిడిఓలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

# అమ్రాబాద్ సర్పంచ్‌కు ఘన సన్మానం









**అమ్రాబాద్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా చిగుర్ల కోటయ్య, ఉప సర్పంచ్‌గా రాజారాం గౌడ్‌తో పాటు 14 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఘన సన్మానం చేశారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ ప్రజా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాన్ని జిల్లాలో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను నిరంతరం పరిష్కరించాలని సూచించారు. అభివృద్ధి దిశగా అమ్రాబాద్ పంచాయతీ ముందుండాలని, ఇది తొలి విజయానికి రూపురేఖలుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్ లింగం గౌడ్, కాంగ్రెస్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు కొయ్యల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ చిర్రా భరత్, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, టౌన్ అధ్యక్షుడు లక్ష్మణ్ చారి, నిరంజన్, సయ్యద్ ఆరిఫ్, ముఖ్బుల్, అక్రమ్, జానీ, గౌస్ అహ్మద్, తిరుమలయ్య, బరపటి చంటి, జోకయ్య, అశోక్, జగన్, కృష్ణయ్యతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# జగిత్యాల్ రోడ్డు విస్తరణ పనులపై కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ అరవింద్



**నిజామాబాద్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జగిత్యాల్ నియోజకవర్గంలో రోడ్డు విస్తరణ, అండర్‌పాస్ పనులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిశారు. జగిత్యాల్ రూరల్ మండల అనంతరం గ్రామంలోని లో లెవెల్ బ్రిడ్జ్ వర్షాకాలంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాగే అంబారిపేట్ రోడ్డు విస్తరణ, రైల్వే అండర్‌పాస్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన వినతి పత్రం అందజేశారు.మంత్రి గడ్కరి సానుకూలంగా స్పందించి పనులు త్వరలో ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి ఎంపీ అరవింద్ ధర్మపురికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ వేలంపాటపై అభ్యర్థి ఫిర్యాదు

**చొప్పదండి, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పెద్ద కురుమపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలో అక్రమంగా వేలంపాట నిర్వహించి ఏకగ్రీవం చేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన తోట్ల జమున జిల్లా కలెక్టర్, ఆర్డీవో, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం, ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేసిన గ్రామంలో పెద్దలు వేలంపాట నిర్వహించగా, 20 లక్షలు చెల్లించి మావురం సుగుణ సర్పంచ్ పదవి దక్కించుకున్నారని, మిగతా ఇద్దరు అభ్యర్థులను తప్పుకోవాలని ఒత్తిడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామ ప్రజలు ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఫిర్యాదు స్వీకరించలేదని వాపోయారు. తాజాగా తోట్ల జమున అధికారులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఈ విధానాన్ని అరికట్టాలని గ్రామ ప్రజలు కలెక్టర్‌ను కోరుతున్నారు.

# పుస్తెలతాడును అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది



**హుస్నాబాద్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వర్కుల్ -కోహెడ రూట్‌లో నడుస్తున్న బస్సు (నెం.2426)లో ప్రయాణిస్తున్న ఒక మహిళా ప్రయాణికురాలు తన పుస్తెలతాడును పోగొట్టుకుంది. ఈ విషయాన్ని గమనించిన హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ కరుణ, డ్రైవర్ యూసీ మౌళి నిజాయితీతో వ్యవహరించారు. వారు ఆ పుస్తెలతాడును సురక్షితంగా తీసుకువచ్చి డిపో అధికారుల సమక్షంలో సంబంధిత ప్రయాణికురాలికి అప్పగించారు. తమ విధుల్లో నిజాయితీని చాటుకున్న ఈ చర్యకు ప్రయాణికురాలు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.హుస్నాబాద్ డిపో ఆర్టీసీ సిబ్బంది చూపిన ఈ నిబద్ధత ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని అభినందనలు వెల్లువెత్తాయి.

# చంద్రశేఖర్ నగర్‌లో డ్రైనేజీ మరమ్మత్తులు



**రామగుండం, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బ్రహ్మగుండం మున్సిపల్ పరిధిలోని 56వ డివిజన్ చంద్రశేఖర్ నగర్‌లో పగిలిపోయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మూతలను తొలగించి కొత్త మూతలను అమర్చారు. సమస్యను గుర్తించిన వెంటనే ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని సిబ్బందిని పంపించి పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్ కొమ్ము వేణు మాట్లాడుతూ డివిజన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారుల సహకారంతో కృషి చేస్తున్నామని తెలిపారు. 56వ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామని, ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# కిసాన్ ఫ్యాషన్ మాల్ ప్రారంభం



**మెదక్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెదక్ పట్టణ కేంద్రంలో కిసాన్ ఫ్యాషన్ మాల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి హాజరై మాల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు తదితరులు పాల్గొని మాల్ ప్రారంభోత్సవాన్ని శుభాకాంక్షించారు. ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త మాల్ ప్రారంభాన్ని ఆనందంగా స్వాగతించారు.

# పండుగ సాయన్న 135వ వర్ధంతి వేడుకలు

-జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో.
బహుజన సామ్రాజ్యాన్ని స్థాపించాలి.
--సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్.



**దేవరకొండ డిసెంబర్ 10. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నాటి తెలంగాణ దొరలను ఎదిరించి వాళ్లు దోచుకున్న ప్రజల సొమ్మును గుంజుకొచ్చి తిరిగి ప్రజలకు పంచిన బహుజన బంధు,తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న అని నేడు మనం చదువుతున్నది పాలకులు రాసింది నిజమైన చరిత్ర కాదు అగ్రకులాల అహంకారపు దురహంకారాలను తొక్కి వేసినటువంటి మహనీయుడు ఆదర్శంగా తీసుకొని బహుజన్లందరూ ఐక్యమై రాజ్యాధికారి కోసం పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు,డాక్టర్ భాషా చౌహన్,ఎండి ఖాదర్ బాబా,మాకం చంద్రమౌళి,పెరికేటి శ్రీనివాస్ చారి,దామెర షాంసన్,భీమగోని శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న వర్ధంతి సందర్భంగా నివాళులు



**మిర్యాలగూడ, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవనంలో పండుగ సాయన్న వర్ధంతి కార్యక్రమం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ కో కన్వీనర్ దాసరాజు జయరాజ్, కో కన్వీనర్ చేగొండి మురళి యాదవ్, బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ లింగంపల్లి చిరంజీవి, పద్మశాలి నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లల మరి రవి కుమార్, పున్నా రాములు, మాజీ అధ్యక్షుడు రాపోలు సత్యనారాయణ, తిరుపతయ్య తదితరులు పాల్గొని పండుగ సాయన్నకు నివాళులు అర్పించారు.వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ, బీసీ సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు.

# మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారు బీభత్సం



**రాచకొండ, డిసెంబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా రాచకొండ కమిషనరేట్‌కు చెందిన మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బాలాపూర్ నుండి మందమల్లమ్మ చౌరస్తా ప్రధాన రహదారి వద్ద దాదు నగర్ సమీపంలో వేగంగా వస్తున్న కారు ఆకస్మాత్తుగా అదుపు తప్పి రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే కారు పల్టీ కొట్టి బీభత్సం సృష్టించింది.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన మీర్పేట్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# వాజీబ్ పలువురికి ఆదర్శం

**కొండపాక, డిసెంబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ చరిత్రలో తొలిసారిగా ఆర్మీలో అడుగుపెట్టిన యువకుడు మహమ్మద్ వాజీబ్. ఇప్పటివరకు ఈ గ్రామం నుండి దేశ సేవలో భాగమయ్యే అవకాశం ఎవరికి రాకపోవడంతో, వాజీబ్ ఎంపిక గ్రామానికి గర్వకారణమైంది.చిన్న సన్నకారు రైతు మహమ్మద్ అజీముద్దీన్ కుమారుడైన వాజీబ్, డిగ్రీ పూర్తి చేసిన తరువాత సాధారణ ఉద్యోగం చేసి జీవితాన్ని కొనసాగించాలనుకోలేదు. దేశం పట్ల తనకున్న గౌరవాన్ని, దేశభక్తిని ప్రతిఫలింపజేయాలనే సంకల్పంతో ముందడుగు వేసాడు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ కార్యక్రమంలో ఎంపికై, కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి స్వగ్రామానికి చేరుకున్నాడు.వాజీబ్ తిరిగి గ్రామానికి చేరుకున్న సందర్భంగా గ్రామస్తులు, స్నేహితులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. తమ గ్రామం నుండి తొలిసారిగా ఆర్మీలో చేరి దేశ సేవలో భాగమైనందుకు అతనిని ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా వాజీబ్ మాట్లాడుతూ యువత తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా, లభించిన అవకాశాలను వినియోగించుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చాడు. అతని మాటలు గ్రామ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

# కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ప్రచారానికి బ్రహ్మారథం పట్టిన ప్రజలు





**యాచారం , డిసెంబర్ 10 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
యాచారం మండలం మేడిపల్లి - నక్కర్త కాంగ్రెస్ అభ్యర్థి ముచ్చర్ల సుగుణ-సంపత్ బ్యాట్ గుర్తుకే మన ఓటు గెలిపించేందుకు గ్రామంలోని ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బుధవారం మేడిపల్లి - నక్కర్త గ్రామంలోని పలు వార్డులలో బ్యాట్ గుర్తుకే మన ఓటు గెలిపించాలని

ఇంటింటి ప్రచారం నిర్వహించేందుకు గ్రామంలోని ప్రజలు వందలాదిమంది తరలివచ్చి ముచ్చర్ల సుగుణ-సంపత్ గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సంద్భంగా ముచ్చర్ల సుగుణ-సంపత్ కార్యకర్త లతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ.... నేను పుట్టిన మేడిపల్లి గడ్డ సాక్షిగా అడుగుతున్న "ఒక పేదోడికి" అవకాశం ఇవ్వండి ఆశీర్వదించండి. అభివృద్ధి అంటే ఏంటో



చూపిస్తాను అని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు .ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడానికి కృషి చేస్తానని కుల,మత మరియు రాజకీయ భేదాలు లేకుండా ప్రతి ఇంట్లో ఒక్కడిగా మీతో ఉంటానని.. ప్రభుత్వం నుంచి వచ్చే ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు మరియు గ్రామ అభివృద్ధికి సంబంధించిన అన్ని రకాల అభివృద్ధి పనులు చేయించడానికి నేను మీ ముందుకు వస్తున్నందుకు నన్ను ఆశీర్వదించండి. అధికార పార్టీ అండదండతో మీ ముందుకు వస్తున్నాను ఆశీర్వదించండి- అభివృద్ధి చేసి చూపిస్తాను.నక్కర్త మేడిపల్లి గ్రామానికి ఒక సేవకుగా సేవ చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేస్తున్న అభివృద్ధిలో తమ గ్రామాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు ఆశీర్వదిస్తే అధిక నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో మేడిపల్లి - నక్కర్త మాజీ సర్పంచ్ బాలరాజు,మాజీ ఎంపీటీసీ మొటే శ్రీశైలం , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



**నల్లగొండ, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడతలో భాగంగా 14 మండలాల పరిధిలోని 318 గ్రామపంచాయతీలలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం ఆమె జిల్లా కేంద్రంలోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం సుమారు 7000 మంది సిబ్బందిని నియమించామని, 5600 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని వెల్లడించారు. ప్రతి మండలానికి ఒక DRC కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు, రూట్ అధికారులతో పాటు ఇద్దరు లేదా ముగ్గురు జోనల్ అధికారులను కూడా నియమించామని తెలిపారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ శాతాన్ని ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదు చేసే విధంగా ఏర్పాట్లు చేసినట్లు, పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రం నుంచే సంబంధిత కేంద్రాలకు చేరుకుంటారని, వారికి అవసరమైన భోజనం, వసతి, అలాగే ప్రత్యేక కిట్‌ను కూడా అందజేస్తున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బంది స్టాచ్యుటరీ, నాన్ స్టాచ్యుటరీ మెటీరియల్‌ను జాగ్రత్తగా పరిశీలించాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే ఎంపీడీవో లేదా డీఆర్డీవోను సంప్రదించాలని సూచించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, కేంద్రం నుండి పత్రాలు బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా పోలింగ్ ప్రారంభించాలని, ఒకసారి ప్రతిపాదించిన ఏజెంట్లను మార్చరాదని స్పష్టం చేశారు. టెండర్, ఛాలెంజ్ ఓట్ల విషయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, ఏవైనా గొడవలు జరిగే అవకాశం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వైద్య అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పీహెచ్సీ వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ టీమ్ తమ రూట్, జోనల్ అధికారుల ఫోన్ నంబర్లు కలిగి ఉండాలని ఆదేశించారు. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ఆమోదించిన 14 గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపించవచ్చని తెలిపారు. పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ నిర్వహించి, ఉప సర్పంచ్ ఎన్నికను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, తహసిల్దార్ పరుశురాం, ఎంపీడీవో యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కసారి అవకాశం కల్పిస్తే.. మాల్ ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- శ్రీనివాస్ ముదిరాజ్



మాల్ లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి శ్రీనివాస్ ముదిరాజ్




**యాచారం , డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** యాచారం మండలం మాల్ గ్రామం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ ఒక్కసారి అవకాశం కల్పిస్తే.. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానంటూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గడప గడపకు ప్రచారం ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారంలో దూసుకెళుతున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ గ్రామ ఓటర్లు అడుగడుగునా నీరాజనం పలుకుతూ విజయం నీదేనంటూ దీవెనలు ఇస్తున్నారు. బీసీ వర్గానికి చెందిన ... గ్రామ సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా.. తనని సర్పంచ్ గా గెలిపిస్తే అభివృద్ధి చేస్తాను అంటున్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, గ్రామంలో మురికి కాల్వల, సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తానని.. మాల్ గ్రామాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళతానని ఓటర్లకు హామీ ఇస్తున్నారు.

## మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సిబ్బంది కి రాండమైజేషన్

-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.



**దేవరకొండ డిసెంబర్ 10. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న దేవరకొండ డివిజన్లోని 9 మండలాలలో విధులు నిర్వహించే సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కోర్రా లక్ష్మీ సమక్షంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో నిర్వహించడం జరిగింది. చందంపేట, చింతపల్లి, దేవరకొండ, గుడిపల్లి ,గుండ్లపల్లి, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, నేరేడుగోమ్ము, మండలాలలోని 2206 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను 2647 మంది పిఓలు ,2959 మంది ఓపిఓలను విధులకు నియమించడం జరిగింది. వీరికి సంబంధించి రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించడం జరిగింది. జిల్లా సాధారణ పరిశీలకురాలు సమ్మతితో ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో పాటు, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, దేవరకొండ ఆర్ డివో రమణారెడ్డి, డీఈఓ బిక్షపతి ,నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్,ఈ డి ఎం దుర్గా రావు, ఎన్ఐసి అధికారి ప్రేమ్ తదితరులు ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఇర్విన్‌లో జిల్లా వ్యవసాయ అధికారి ఉష ఆకస్మిక తనిఖీ



**మాడుగుల, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలంలోని ఇర్విన్, అప్పారెడ్డిపల్లి, మాడుగుల గ్రామాలలోని వివిధ ఎరువుల అధీకృత షాపులను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఉష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ల వద్ద ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించి, తగు ఆదేశాలను జారీ చేశారు. స్టాక్ నిల్వలను ఎప్పటికప్పుడు ఈ-పాస్ లో నమోదు చేయాలని, అమ్మిన ఎరువులను వెంటనే ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేసి అప్డేట్ చేయాలని డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఉష గారితో పాటు మండల వ్యవసాయ అధికారి శ్రీమతి డి. అరుణకుమారి, ఆయా క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, రాజేష్ నాయక్ మరియు డీలర్లు మర్రెడ్డి, మహేష్, జహంగీర్, శివశంకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు

**వనపర్తి,డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** 2025 -26 విద్యాసంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు పూర్తి పరీక్షా కాలపట్టికను విడుదల చేసింది. ప్రతి పరీక్షకు దాదాపు మూడు రోజుల విరామం కల్పించినట్లు వనపర్తి జిల్లా విద్యాధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న పరీక్షా కేంద్రాల వివరాలు, ప్రతి కేంద్రంలో హాజరయ్యే విద్యార్థుల సంఖ్యను త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా విద్యాశాఖ ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు.

## డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించి సమస్యను పరిష్కరించాలి

ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎంక్లేవ్, జీడిమెట్ల గ్రామ హనుమాన్ దేవాలయం సమీపంలో మురుగునీరు లీకేజీ సమస్యను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గారు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులను కల్పించడంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. సమస్యను పరిష్కరించేందుకు వెంటనే భూగర్భ డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచి కొత్త లైన్లను నిర్మించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు కాలే నాగేష్, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, తోకల నాగేష్ రెడ్డి, సమ్మయ్య నేత, కాలే గణేష్, శ్రీకాంత్, బాల మల్లేష్, విజయ్ హరీష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలాంటి ఇబ్బందులకు అవకాశం ఇవ్వకుండా మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బుధవారం ఆమె గట్టుప్పల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల పంపిణీ, స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల సామాగ్రి పంపిణీకై ఆయా రూట్ల వారిగా ఏర్పాటు చేసిన టబుళ్ళు, స్టాచ్యుటరి, నాన్ స్టాట్యూచరి పేపర్లు, ఓటరు కంపార్ట్మెంట్ మెటీరియల్, ఇండెలిబుల్ ఇంక్, ఇతర సామాగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీ.ఆర్ సీ అధికారులకు పలు సూచనలు చేస్తూ పిఓలు డైరీ జాగ్రత్తగా రాసేలా తెలియజేయాలని, అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్, చాలెంజ్ ఓట్ల విషయంపై ఇబ్బందులు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించాలన్నారు. పోలింగ్ శాతాన్ని ప్రతి రెండు గంటలకు ఒకసారి టీ -పోల్ లో ఎలాంటి తప్పులు లేకుండా అప్లోడ్ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులతో ముందే సమన్వయం చేసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పిసిఈఓ శ్రీనివాసరావు, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి ,తదితరులు ఉన్నారు.

## గ్రామావృద్ధికి కీలకం ఓటు

గంగవరం రామకృష్ణారెడ్డి



**వనపర్తి,డిసెంబర్ 10( నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణలో జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని బలపరచే పర్వదినమని టీజేఎఫ్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధి, పారదర్శకత, ప్రజాసేవకు కట్టుబడి ఉన్న నాయకుడిని ఎన్నుకోవాల్సిన సమయం ఇదేనని తెలిపారు. ప్రతి ఓటు గ్రామ భవిష్యత్తును నిర్ణయిస్తుంది కాబట్టి ప్రజలందరూ తప్పక ఓటు హక్కును వినియోగించాలని పిలుపునిచ్చారు. “మన ఊరు ముందుకు సాగాలంటే మంచి నాయకుడిని మనమే ఎన్నుకోవాలి. శాంతియుతంగా, బాధ్యతతో ఓటు వేయండి” అని ఆయన సందేశం ఇచ్చారు.

# ప్రచారంలో ఊగుతున్న పల్లెలు..?

## నాటు కోడి, మటన్, చికెన్ ఫ్రైతో అభ్యర్థుల కాక




-బ్రాండెడ్ విస్కీ కి ఫుల్ డిమాండ్

-మద్యానికే రూ. లక్ష నుంచి రూ.3లక్షలకు పైగా ఖర్చు..?




**కడ్తాల్, డిసెంబర్ 10 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పంచాయతీ పోరు పల్లెను మత్తెక్కిస్తోంది. రాత్రైతే చీర్స్‌తో ఊరు చిందులేస్తోంది. పెద్ద మనుషులు, కుల, యువజన సంఘాల మద్దతు కోసం అభ్యర్థులు మందును ఎరగా వేస్తున్నారు. మనీకి లొంగని నేతలను మద్యంతో తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక పొద్దంతా ప్రచారంలో వెంట తిరిగే క్యాడర్‌ను చీకటి పడితే చాలు మందు, విందులతో చేజారకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎన్నికల ఖర్చులో సగానికి పైగా మద్యం కోసం అభ్యర్థులు వెచ్చిస్తున్నారు. ఇక మద్యంతో పాటు ఇతర ప్రలోభాలతో ఓటర్లకు ఎర వేసే పనిలో అభ్యర్థులు బిజీగా ఉన్నారు.

**సర్పంచి ఖర్చులకు తగ్గేదేలే..**
ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులు చాలా చోట్ల ఖర్చులకు తగ్గేదేలే అంటున్నారు. ఎన్నికల ప్రచారాన్ని అసెంబ్లీ ఎన్నికలకు తీసిపోకుండా నిర్వహిస్తున్నారు. ప్రచార వాహనాలతో పాటు ఖర్చు ఎంతైనా పర్వాలేదు.. ఒక్కసారి ఊరికి సర్పంచ్ కావాలే.. అనే లక్ష్యంతో ఓట్ల కోసం నోట్లను నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. వలస వెళ్లిన ఓటర్లకు ప్రత్యేకంగా వాహనాలు, ఇతర ఖర్చులు కూడా సర్దేస్తున్నారు.
చేతిలో చిల్లిగవ్వ లేకున్నా.. రిజర్వేషన్ కలిసి వచ్చిన వాళ్లు అప్పులు చేసి మరీ ఖర్చు చేస్తున్న పరిస్థితి కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో చోటు చేసుకుంటుంది.






## ఆక్రమణలను తొలగించి నాలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుభాష్ నగర్ డివిజన్ గంప బస్తీ నాలా నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గారు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా నాలా నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా మురుగునీరు ప్రవాహం సాఫీగా సాగుతుందని తెలిపారు. నాలా ప్రవాహ దిశలో ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించి, అట్టి నిర్మాణాలను తొలగించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీసీ నరసింహ, వాటర్ వర్క్స్ జిఎం మాధవి, జిహెచ్ఎంసి ఈఈ లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, టౌన్ ప్లానింగ్ అధికారులు సురేందర్ రెడ్డి, మధు, జిహెచ్ఎంసి ఏఈ అనురాగ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్, కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, శ్రీనివాసరాజు, గుబ్బల లక్ష్మీనారాయణ, ఆశిక్ అలీ, ఇస్మాయిల్, ప్రసాద్, శంకర్, శ్రీను, దుబాయ్ శ్రీను, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగేందుకు కరీంనగర్ మండలంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అదనపు డీసీపీ వెంకటరమణ తెలిపారు.బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో గురువారం జరగనున్న పోలింగ్ కోసం అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. నగునూరు, చామనపల్లి, చెర్లభూతూర్, మ్నొంపూర్, చేగుర్తి గ్రామాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అదనపు బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. మండలాన్ని ఆరు రూట్లుగా విభజించి ఒక్కో రూట్‌కు ఎస్సై, రెండు రూట్లకు సీఐలకు బాధ్యతలు అప్పగించారని, ఏసీపీ ఆరురూట్లను నిరంతరం పర్యవేక్షిస్తారని వివరించారు. మొత్తం నలుగురు సీఐలు, ఎనిమిది ఎస్సైలు, 80 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నుండి శుక్రవారం వరకు అన్ని గ్రామాల్లో పెట్రోలింగ్ కొనసాగుతుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐలు నిరంజన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జాన్రెడ్డి, సదస్కుమార్‌తో పాటు ఎస్సైలు పాల్గొన్నారు.


## ప్రభుత్వ ఆఫీసులపై ప్రైవేట్ బ్రాండ్ బోర్డులు

# ప్రజా విశ్వాసం దెబ్బతింటుందా?

**వనపర్తి,డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఆఫీసుల వద్ద ఒక కొత్త ధోరణి కనిపిస్తోంది. పోలీస్ స్టేషన్లు, మున్సిపల్ కార్యాలయాలు, హాస్పిటల్స్ వంటి ప్రజలకు సంబంధించిన సంస్థల వద్ద "చందనా బ్రదర్స్", "రిలయన్స్", " పేరుగాంచిన ఎలక్ట్రానిక్స్" వంటి ప్రైవేట్ కంపెనీల పేర్లతో బోర్డులు కనిపించడం ప్రారంభమైంది. ఇవి సాధారణ ప్రకటన బోర్డులు కాదుబీ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ బోర్డులను డొనేట్ చేసిన పేరిట వాటి బ్రాండ్ పేర్లు ప్రధానంగా కనిపిస్తున్నాయి.ప్రజల్లో సందేహాలు కలుగుతున్నాయి, ప్రాథమికంగా కొన్ని సందేహాల విషయానికొస్తే

**ప్రభుత్వ ఆఫీసు బోర్డు పై ప్రైవేట్ బ్రాండ్ పేరు ఎందుకు?**
ప్రభుత్వ సంస్థలు ప్రజాధనంతో నడుస్తాయి. అవి ఏ ప్రైవేట్ సంస్థకీ ప్రచారం చేసే వేదికలుగా మారకూడదు.
అయితే డొనేషన్ పేరుతో పబ్లిక్ ఇంటిస్యూట్ ఐడెంటిటీ మీద ప్రైవేట్ పేరు మారుమ్రోగడం ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తోంది.
ఒక పౌరుడు మాటల్లో చెప్పాలంటే "పోలీస్ స్టేషన్ బయట కంపెనీ పేరు కనిపిస్తే అది ఏ సందేశం ఇస్తుంది? ప్రజా సంస్థల గౌరవం తక్కువైపోదా?" అని ప్రశ్నిస్తున్నారు.
సూక్ష్మ ప్రకటనలా మారుతున్నాయా? డొనేషన్ అనేది పాజిటివ్. కానీ దానిని ప్రమోషన్‌కు దారితీసేలా మార్చడం ప్రభుత్వ వ్యవస్థ విశ్వసనీయతకు ముప్పు అని నిపుణులు అంటున్నారు. అనేక రాష్ట్రాలలో ప్రభుత్వ భవనాలపై ప్రైవేట్ ప్రకటనలు కఠినంగా నిషేధించబడ్డాయి.
తెలంగాణలో కూడా పబ్లిక్ ప్లేస్‌లలో ఇలాంటి స్పాన్సర్డ్ బోర్డులకు నిర్దిష్ట నిబంధనలు ఉన్నాయి. కానీ నిబంధనలు పాటించే విధానం లోపించడంతో "డొనేషన్ బోర్డు" ? "బ్రాండ్ బోర్డు" గా మారిపోయే ఘటనలు పెరుగుతున్నాయి.
ప్రభుత్వ ప్రతిష్టకు నష్టం పోలీస్ స్టేషన్, తహసీల్దార్ ఆఫీస్, జిల్లా ఆసుపత్రి లాంటి సంస్థలు న్యూట్రల్ సింబల్స్. అక్కడ ప్రైవేట్ పేరు కనిపించడం అంటే ప్రభుత్వమే ఒక బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నట్టే. ఇది క్రమంగా ప్రజా నమ్మకానికి, ప్రభుత్వ స్వచ్ఛ ఇమేజ్‌కు నేరుగా దెబ్బ. పరిపాలనా పారదర్శకత అవసరం డొనేషన్లను అంగీకరించడంలో తప్పులేదు. కానీ ప్రైవేట్ బ్రాండింగ్ను ప్రధాన బోర్డుల్లో కాకుండా ఒక చిన్న ప్లేట్‌లో "డొనేటెడ్ బై" అనే విధంగా పెట్టడం సరైన విధానం అని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా దీనిపై స్పష్టమైన గైడ్‌లైన్స్ జారీ చేస్తే అనవసర వివాదాలకు, ప్రజల్లో పెరుగుతున్న సందేహాలకు తెరపడుతుంది.




# ఎలక్షన్ సామాగ్రి పంపిణీ...

**మహబూబాబాద్, డిసెంబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా లో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహబూబాబాద్ పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ లో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. జిల్లాలో మొదటి విడత ఎన్నికల్లో 155 గ్రామ పంచాయతీలకు గాను 9 గ్రామ పంచాయతీలు , 1338 వార్డులకు గాను 266 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. రేపు ఎన్నికలు జరకానున్న 146 గ్రామ పంచాయతీలకు 468 మంది , 1072 వార్డు స్థానాలకు 2391 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 1621 పి.ఓ లు , 1853 ఓపిఓ లు , 10 మంది మైక్రో అబ్జర్వర్ల తో పాటు ఐదుగురు రిజర్వు అబ్జర్వర్లు ఎన్నికల విధులను నిర్వహిస్తున్నారు.ఓటింగ్ కు 1753 బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తున్నారు. 49 రూట్లలో , 15 మంది జోనల్ అధికారులు పోలింగ్ ను పర్యవేక్షించనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 122 సి.సి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు జరిగే మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి , గూడూరు, నెల్లికుదురు 5 మండల కేంద్రాల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ ఎన్నికల్లో 1 లక్షా 78 వేల 951 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎలాంటి అవాంఛనీయ



సంఘటన చోటు చేసుకోకుండా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ ఓ ప్రకటన లో తెలిపారు.5 డిఎస్పీ లు , 16 మంది ఇన్స్పెక్టర్లు , 60 ఎస్.ఐ లు , 1000 మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల విధులను నిర్వహిస్తున్నారని, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల వరకు ప్రచారం, పార్టీ చిహ్నాలు, గుంపులు.. గుంపులుగా గుమికూడటాన్ని పూర్తిగా నిషేధించామని, సెన్సిటివ్ మరియు హై సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లలో అదనపు పికెటింగ్ , వీడియో రికార్డింగ్, స్ట్రైకింగ్ ఫోర్సులు ఏర్పాటు చేయబడ్డాయని, పోలింగ్ స్టేషన్ ల లోకి ప్రచార సామగ్రి, మొబైల్ ఫోన్లు, పార్టీ చిహ్నాలు తీసుకురావడాన్ని
నిషేధించామని , ఎన్నికల కోడ్ దృశ్య విజయోత్సవ ర్యాలీలను నిషేధించామని తెలిపారు.

# సమాజంలో సంతోషం కోసమే చట్టాలు

## జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ...



**మహబూబాబాద్, డిసెంబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సమాజం సంతోషం గా మనుగడ సాగించటానికి వివిధ చట్టాలు చేశారని అయితే ఆ చట్టా న్ని ఉల్లంఘించినట్లయితే సంతోషం దూరం అవటమే కాకుండా శిక్షలు అనుభవించాలి వస్తుందని మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తలపెట్టిన వందరోజుల "బాల్ వివాహ్ ముక్త్ భారత్" క్యాంపెయిన్ ను న్యాయమూర్తి బుధవారం ఉదయం స్థానిక అంబేద్కర్ సెంటర్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ 2006 వ సంవత్సరంలోనే బాల్యవివాహాలను నిరోధిస్తూ చట్టం వచ్చినప్పటికీ అది నేటికీ పూర్తిగా అమలుకు నోచుకోవట్లేదని అన్నారు. కొన్ని అలవాట్లు చట్టాలుగా మారుతాయని మరికొన్ని అలవాట్లు సమాజానికి హానికరమైనట్లయితే వాటిని నిషేధిస్తూ చట్టాలు వస్తాయని అటువంటి వాటిలో బాల్య వివాహ నిషేధ చట్టం ఒకటని వివరించారు. మహబూబాబాద్ లాంటి జిల్లాలలో బాల్యవివాహాలను అరికట్టటానికి ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థలు గట్టి కృషి సల్పాలని న్యాయమూర్తి పిలుపునిచ్చారు. సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శాలిని షాకెల్లి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వందరోజుల క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగా ఉచిత న్యాయ సేవల టోల్ ఫ్రీ నెంబర్ 15100, చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098, గడపగడపకు అవగాహన, ప్రత్యేక శిక్షణ తరగతులు, మరియు ర్యాలీలు వంటి వాటిని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంతకాల ఉద్యమాన్ని, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా న్యాయ సేవా సంస్థ ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింట్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతి మురారి, ఏ. కృష్ణ తేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్ చందర్ రావు, జిల్లా సంక్షేమ అధికారిని సబిత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ నాగవాణి, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కక్షిదారులు, సాధారణ ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లు పై ఎస్పీ శబరీష్ సూచనలు



**మహబూబాబాద్, డిసెంబర్10(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ డా. శబరీష్ పరిశీలించారు. రేపటి ఎన్నికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 సెక్షన్ BNSS అమల్లో ఉంటుందని, 100 నుండి 200 మీటర్ల పరిధిలో ప్రత్యేక నిబంధనలు అమలులో ఉండటంతో ప్రజలు అనవసరంగా గుమిగూడరాదని స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల లోపల సెల్‌ఫోన్లు, వాటర్ బాటిల్లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు వంటి వస్తువులకు అనుమతి ఉండదని తెలిపారు. ఓటర్లు క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని, ఓటర్లు తప్పనిసరిగా తమ ఐడి కార్డులు తీసుకురావాలని సూచించారు.సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఎస్పీ వెల్లడించారు. ప్రచారం ముగిసిన నేపథ్యంలో బయట వ్యక్తులు గ్రామాల్లో ఉండకూడదని హెచ్చరించారు. ఏవైనా అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఎన్నికల తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ప్రజల్లో భరోసా కల్పిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తికావడానికి పోలీసులు కఠినంగా విధులను నిర్వర్తిస్తున్నారని ఎస్పీ డా. శబరీష్ తెలిపారు.

# తొలి విడత పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత

**నాగర్‌కర్నూలు, డిసెంబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్‌కర్నూలు జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ తెలిపారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని ఆయన సూచించారు. జిల్లాలో మొత్తం 20 రెవిన్యూ మండలాలు, 460 గ్రామపంచాయతీలు, 4102 వార్డులు ఉండగా, వనపర్తి జిల్లాలోని ఏదుల మండల పరిధిలో గల 6 గ్రామపంచాయతీలు కూడా ఈ ఎన్నికల్లో భాగమయ్యాయి. మొత్తం 107 క్రిటికల్ గ్రామపంచాయతీలలో తొలి విడతలో 33 క్రిటికల్‌గా గుర్తించబడ్డాయి. కల్వకుర్తి మండలంలో ఎక్కువగా 12 క్రిటికల్ పంచాయతీలు ఉన్నాయి. 157 గ్రామాల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 17 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగిలిన 140 గ్రామాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల సందర్భంగా మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈగలపెంట మండలంలోని మున్ననూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్, బిజినపల్లి మండలంలోని మంగనూరు జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్, వెల్దండ మండల పరిధిలోని కోట్రా ఎక్స్‌రోడ్ చెక్‌పోస్ట్‌ల ద్వారా ఇప్పటివరకు రూ.1,53,000 నగదు సీజ్ చేశారు. బెల్టు షాపులపై ఉక్కుపాదంతో తనిఖీలు జరిపి 150 లిక్కర్ కేసులు నమోదు చేసి, 1470 లీటర్ల మద్యం సీజ్ చేశారు. దీని విలువ సుమారు రూ.6,90,522గా అంచనా. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ 834 మందిని బైండోవర్ చేశారు. లైసెన్స్ కలిగిన 22 ఆయుధాలను జిల్లా ఆయుధ కారాగారంలో డిపాజిట్ చేయించారు. మొదటి విడత పోలింగ్‌లో భాగంగా 900 మంది పోలీసు సిబ్బందిని వివిధ పోలింగ్ స్టేషన్లకు కేటాయించారు. వీరిలో 3 SST టీమ్స్, 20 FST టీమ్స్, అదనపు ఎస్పీ 1, డీఎస్పీలు 4, సీఐలు 13, ఎస్సైలు 44, ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుల్ ర్యాంక్ అధికారులు 168 మంది, కానిస్టేబుళ్లు 520 మంది, హోంగార్డులు 100 మంది ఉన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు.

**సోషల్ మీడియాపై నిఘా**

ఎన్నికల సందర్భంగా సోషల్ మీడియాలో నిరంతర నిఘా కొనసాగుతోందని ఎస్పీ వెల్లడించారు. విద్వేషపూరిత పోస్టులు పెట్టిన, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు షేర్ చేసిన వారితో పాటు గ్రూప్ అడ్మిన్‌లపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# మెదక్‌లో 12వ కిసాన్ షాపింగ్ మాల్ ఘనంగా ప్రారంభం





**మెదక్, డిసెంబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మెదక్ పట్టణంలో కిసాన్ గ్రూప్ తన 12వ షాపింగ్ మాల్‌ను వైభవంగా ప్రారంభించింది. ప్రముఖ సినీనటి అనసూయ భరద్వాజ్ చేతుల మీదుగా జరిగిన ఈ ప్రారంభోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మాల్ అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిసాన్ గ్రూప్ చైర్మన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ, "కిసాన్ మాల్‌లోని తాజా ఫ్యాషన్ కలెక్షన్లు, విశాలమైన షాపింగ్ స్పేస్, కుటుంబం మొత్తం కోసం అందుబాటులో ఉన్న విభిన్న విభాగాలు నాకు ఎంతో నచ్చాయి. మెదక్ ప్రజలకు అద్భుతమైన షాపింగ్ అనుభవం లభించనుంది" అని ఆనందం వ్యక్తం చేశారు.కిసాన్ గ్రూప్ చైర్మన్ ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, "మెదక్ ప్రజల అభిరుచులు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మాల్‌ను రూపొందించాం. నాణ్యత, స్టైల్, వినియోగదారుల సంతృప్తి మా ప్రధాన లక్ష్యాలు. ఈ మాల్ ద్వారా స్థానిక వాణిజ్యం, ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తాయి. భవిష్యత్తులో మరిన్ని సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు.ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రజలు విభాగాల వారీగా ఏర్పాటు చేసిన కొత్త కలెక్షన్లు, ఆధునిక షాపింగ్ స్పేస్‌ను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. మొదటి రోజునే భారీ సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి మాల్‌ను సందర్శించారు. కిసాన్ మేనేజ్‌మెంట్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ మాల్ మెదక్ వాణిజ్య, సేవా రంగానికి కొత్త ఊపును తీసుకురావడమే కాక, భవిష్యత్తులో మరిన్ని సేవలను విస్తరించనుంది.

# సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ బిల్లులు విడుదల చేయాలని విజ్ఞప్తి



**హైదరాబాద్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థుల మెస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంత్రుల నివాసంలో కలసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎనిమిది నెలలుగా మెస్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులకు సరైన పోషకాహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన కాస్మెటిక్ చార్జెస్ బిల్లులు ట్రెజరీలో సబ్మిట్ చేసినప్పటికీ ఇప్పటివరకు విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని తెలిపారు. పార్ట్‌టైమ్ వర్కర్లకు నెలకు ?12,196 జీతం ఉన్నప్పటికీ మే, జూన్, జూలై నెలలకు బడ్జెట్ "ఇన్‌వ్యాలిడ్ హెడ్ ఆఫ్ అకౌంట్" కారణంగా విడుదల కాలేదని పేర్కొన్నారు. విద్యార్థులు, వర్కర్లు, వార్డెన్లను ఆదుకోవాలని వినతి పత్రంలో కోరారు. బీసీ జేఏసీ ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# వెల్దండలో కాంగ్రెస్ అభ్యర్థి మట్ట యాదమ్మ విజయం ఖాయం అని విశ్లేషకుల అంచనా




**వెల్దండ, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ విజయం ఖాయమని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. మట్ట వెంకటయ్య గౌడ్‌తో కలిసి ఆమెకు ప్రజల మద్దతు, అభిమానులు, కార్యకర్తల కృషి అత్యధిక మెజార్టీని సాధించేందుకు దోహదం చేస్తుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రజల చిరకాల ఆకాంక్ష మేరకు మట్ట యాదమ్మను సర్పంచ్‌గా గెలిపించాలని వెల్దండ ప్రజలు సంకల్పించారని, ఆమె గత కొన్నేళ్లుగా ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని స్థానికులు తెలిపారు. మాజీ సర్పంచ్ ముత్యాలయ్య కలలు సాకారం కావాలని, గ్రామ అభివృద్ధి కోసం మట్ట యాదమ్మ%–%మట్ట వెంకటయ్య గౌడ్ జంటకు అవకాశం రావడం దేవుడిచ్చిన వరమని ప్రజలు అభిప్రాయపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం తీసుకొచ్చిన అభివృద్ధి చర్యలు ప్రజల్లో కాంగ్రెస్ వైపు ఆకర్షణ పెంచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతవరకు మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్‌కు ఓటమి లేదని, వెల్దండ అభివృద్ధి కోసం వారు చేపట్టిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని విశ్లేషకులు స్పష్టం చేశారు. మాజీ సర్పంచ్ ముత్యాలయ్య కలల మేరకు వెల్దండ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే వారి ఏకైక లక్ష్యమని తెలిపారు.

# కరీంనగర్‌లో ఎన్నికల బందోబస్తు పర్యవేక్షణ



**కరీంనగర్, డిసెంబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి విడతలో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐదు మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా కేటాయించిన పోలీస్ సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు చర్యలు సక్రమంగా అమలవుతున్నాయా అన్నది సమీక్షించి, అవసరమైన సూచనలు చేశారు.ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ విభాగం పూర్తి స్థాయి సిద్ధతతో ఉందని కమిషనర్ గౌస్ ఆలం స్పష్టం చేశారు.



గ్లామర్ తో గత్తర లేపుతున్న యంగ్ బ్యూటీ కృతి శెట్టి




# శ్రీ‌శ్రీవారణాసిలో యుగయుగాల చరిత్ర

## ఐదు అవతారాల్లో కనిపించనున్న మహేశ్

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇండియన్ సినిమా చరిత్రలోనే రికార్డు స్థాయి బ్జడెట్‌తో నిర్మాణం జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరవేయాలనే లక్ష్యంతో రాజమౌళి ప్రతి ప్రమోషన్‌ను అత్యున్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇక ఇదిలా ఉంటే వారణాసికి సంబంధించిన మరో వార్త కూడా నెట్టింట వైరల్‌గా మారింది.చిత్రంలో మహేష్ ఏకంగా ఐదు అవతారాల్లో కనిపించబోతున్నాడని అంటున్నారు. సినిమాలో చాలా యుగాలు చూపించబోతున్న నేపథ్యంలో యుగానికి ఓ అవతారంలో మహేష్ కనిపిస్తాడా అని ముచ్చటించుకుంటున్నారు. గెటప్స్ ఏంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే . రాజమౌళి అయితే వీటిని ఇప్పట్లో రివీల్ చేసే అవకాశం అసలు లేదు. వారణాసిలో మహేష్ రెండు లుక్స్ లో కనిపించబోతున్నారనే క్లారిటీ ఇప్పటికే ఉంది. రుద్ర అనే పాత్రతో పాటు రాముడిగా కనిపించి మహేష్ అలరించనున్నాడు.ఇదే క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో వెలుగుచూసిన కొన్ని ఫోటోలు భారీ హంగామా సృష్టించాయి. లాస్ వెగాస్‌లోని ప్రపంచ ప్రసిద్ధ స్పియర్ బాల్‌పై 'వారణాసి' గ్లింప్స్ ప్రదర్శించారన్న న్యూస్ విపరీతంగా వైరల్ అయింది.



# ఏ హీరోతో. రిలేషన్ లేదు

## నాపై..రోజుకోటి పుట్టిస్తున్నారు!

తన గురించి సోషల్ మీడియాలో రోజుకో పుకారు పుట్టిస్తున్నారని హీరోయిన్ మీనాక్షి చౌదరి వాపోతుంది. తెలుగులో లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, గుంటూరు కారం, తమిళంలో 'కొలై', 'సింగపూర్ సలూన్', 'ది గోట్' వంటి చిత్రాల్లో నటించిన తమిళ ప్రేక్షకులకు దగ్గరైన ఈ నటి తక్కువ కాలంలోనే తనకంటూ ప్రత్యేకంగా ఫ్యాన్స్‌ను సపాదించుకుంది. వరుస చిత్రాలతో టాప్ పోజిషన్‌కు చేరి తమిళ, తెలుగు భాషల్లో బిజీ హీరోయిన్ అయిపోయారు.అయితే.. అదేసమయంలో ఆమెపై సోషల్ మీడియాలో రోజుకో పుకారు వస్తోంది. కొంత కాలంగా మీనాక్షి తొలి సినిమా హీరో సుశాంత్‌తో ప్రేమలో ఉందని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారంటూ వార్తలు బాగా వచ్చాయి.అంతేగాక ఆపై మరోకరి ఇద్దరు ముగ్గురు హీరోలతోనూ కలిపి ఇలాంటి వార్తలు బాగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో..ఈ వార్తలపై ఆమె తాజాగా స్పందించారు.సోషల్ మీడియాలో నెటిజన్లు, యూట్యూబర్స్, వెబ్‌సైట్స్ నిర్వాహకులు సెన్సేషన్ న్యూస్ కోసం ఈ తరహా పుకార్లు పుట్టిస్తూ, నా పేరు డ్యామేజ్ చేస్తున్నారు. ఇలాంటి వారికి ఇంతకుమించిన పని మరొకటి లేదు. నాకు ఏ ఒక్క హీరోతో ఎలాంటి ప్రేమ, రిలేషన్ లేదు' అని ఆమె స్పష్టం చేశారు.ఇదిలాఉంటే ఈ ముద్దుగుమ్మ నటించిన అనగనగా ఒ క రాజు సినిమా ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన పాట మంచి బజ్ తీసుకువచ్చింది.




# సినిమా నిర్మాణం ఎవిరి ఇష్టం వారిదే

## అన్నగారు ప్రచార కార్యక్రమంలో కార్తీ

సినిమాను తెరకెక్కించడంలో ఎలాంటి రూల్స్ లేవని నటుడు కార్తి అభిప్రాయపడ్డారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు' నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించగా, డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా కార్తి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.సినిమాను ఇలానే తీయాలి అని రూల్స్ ఉండవు. మనకు నచ్చినట్లు ప్రేక్షకులకు నచ్చేవిధంగా తెరకెక్కించవచ్చు. ఈ విషయంలో ఎవరి వ్యక్తిగత నిర్ణయం వారిది. ఎవరికి నచ్చినట్లు వాళ్లు రూపొందిస్తారు. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ నేర్పించలేరు. మనం చిన్నప్పటి నుంచి చూసిన సినిమాల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటుంది. మంచి చిత్రాలు రూపొందిస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరణ చూపిస్తారు. 'అన్నగారు వస్తారు'లో మంచి ఫైటింగ్ సీన్స్ ఉన్నాయి. అవి సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని చెప్పారు. ఇక తాను ఇండస్ట్రీకి రావడానికి ముందు అమెరికాలో వర్క్ చేసినట్లు కార్తి తెలిపారు. 'నేను అమెరికాలో మూడు సంవత్సరాలు చదువుకున్నాను. అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసి ఇక్కడకు వచ్చాను. నేను చదువు మానేసి సినిమాల్లోకి వెళ్తాను అని చెప్పగానే అక్కడి వాళ్లందరూ షాక్ అయ్యారు. నువ్వు ఇంత మంచి స్టూడెంట్‌వి సినిమాల్లోకి ఎందుకు వెళ్లడం అన్నారు. ఆ రంగానికి వెళ్లకు కెరీర్ మొత్తం పాడైపోతుంది అన్నారు. నేను ఇండస్ట్రీకి రావడానికి మా కుటుంబం చాలా సపోర్ట్ చేసింది' అని వెల్లడించారు.

# దుమ్మురేపుతున్న మమ్ముట్టి సినిమా



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం 'కళంకావల్' కేరళ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుంది. ఈ సినిమాకు జితిన్ జోస్ దర్శకత్వం వహించగా.. మమ్ముట్టి ఇందులో ప్రతినాయకుడి పాత్రలో నటించగా.. జైలర్ ఫేం వినాయకన్ కథానాయకుడిగా నటించాడు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్లకు పైగా వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో మమ్ముట్టి సైకో పాత్రలో కనిపించగా.. మమ్ముక్క నటన హైలైట్ అని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు. ఈ వీకెండ్ పెద్ద సినిమాలేవి బాక్సాఫీస్ వద్ద లేకపోవడంతో ఈ చిత్రం మంచి కలెక్షన్లు రాబడుతుందని సమాచారం.